నమస్తే తెలంగాణ
నిజామాబాద్
8 నిజామాబాద్, గురువారం 3 ఏప్రిల్ 2025 NIZAMABAD


# మహాసభకు సన్నద్ధం..

బీఆర్ఎస్ ముఖ్యనేతలకు కేసీఆర్ దిశానిర్దేశం

నిజామాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ వేడుకలతోపాటు రజతోత్సవ మహాసభకు సన్నద్ధం అవుతున్నది. ఇందులో భాగంగా ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ముఖ్య నాయకులతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్ రెడ్డి, ముజీబుద్దీన్‌తోపాటు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హన్మంత్ షిండే, బిగాల గణేశ్ గుప్తా, జాజాల సురేందర్, అయేషా షకీల్ అహ్మద్ పాల్గొన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు సైతం ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల నేతలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఉద్యమ కాలంలో నిర్వహించిన చారిత్రక సభలతోపాటు ఈ నెలలో నిర్వహించనున్న భారీ సభకు ఏర్పాట్లు, జన సమీకరణ అంశాలపై అధినేత చర్చించారు. బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించనున్నట్లు కేసీఆర్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈనెల 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగ సభకు లక్షలాది మంది ప్రజలు తరలి వస్తారని, ఈ మేరకు జన సమీకరణకు ఆయా నియోజకవర్గాల్లో నేతలంతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.



సమీక్షలో పాల్గొన్న నాయకులు



సమావేశంలో దిశానిర్దేశం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, చిత్రంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ముజీబుద్దీన్



కేసీఆర్‌కు శాలువా బహూకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, పక్కన జగన్

- ఉమ్మడి జిల్లా నేతలతో సమీక్షించిన అధినేత
- వరంగల్ సభకు భారీగా జన సమీకరణ
- బీఆర్ఎస్ రజతోత్సవ ఏర్పాట్లపై సమావేశం

**నేతల సన్నద్ధత..**

వరంగల్ సభకు సమయం ఆసన్నం అవుతుండడంతో ఉమ్మడి జిల్లాల వారీగా గులాబీ బాస్ కేసీఆర్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. శ్రేణులను సమాయత్తం చేసేందుకు ముఖ్య నాయకులతో సమీక్షలు చేపట్టారు. ఇందులో భాగంగా కేసీఆర్ సమావేశంలో చర్చించిన అంశాల ఆధారంగా త్వరలోనే నియోజకవర్గాల్లో సమావేశాలను ముఖ్య నేతలంతా నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఏర్పడి 25 ఏండ్లు పూర్తవుతున్న శుభ సందర్భంలో రజతోత్సవ వేడుకలను అత్యద్భుతంగా నిర్వహించేందుకు పార్టీ అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా వచ్చే అవకాశాలు ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేసేందుకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు సిద్ధం అవుతున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేసేందుకు నేతలంతా నిమగ్నమవుతున్నారు. ఎండ వేడిమి ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవడం, మహాసభకు జనాల రాకపోకలకు ప్రభుత్వం ఇక్కట్లు సృష్టించే అవకాశాలు ఉన్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకునేందుకు నేతలంతా రెడీ అవుతున్నారు. దాదాపుగా ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాల వారికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీవ్రంగా దెబ్బ తీసింది. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసింది. పాలన చేతగాక బీఆర్ఎస్ పార్టీపై నిత్యం నిందలు వేస్తూ కాలం గడుపుతున్న తీరుపై ప్రజల్లోనూ కాంగ్రెస్ పార్టీ సర్కారుపై అసహనం ఏర్పడింది. ఇలాంటి క్రియాశీలక సమయంలో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ నిర్ణయించడంతో తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ నేతల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఉద్యమ స్ఫూర్తితో వరంగల్ సభను దిగ్విజయం చేసేందుకు కార్యాచరణ రూపకల్పనలో భాగం కానున్నారు.

# తెలంగాణ యూనివర్సిటీ బంద్

**హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని నిరసిస్తూ..**

- సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర, దహనం
- రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 2: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూముల అమ్మకాన్ని నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ యూనివర్సిటీ బంద్ నిర్వహించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ నుంచి యూనివర్సిటీ మెయిన్ గేట్ వరకు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి, దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకుడు శివ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తున్నదని ఆరోపించారు. విద్యార్థులు, మేధావులు హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తూ భూములు అమ్మడం దారుణమన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కండ్లు తెరిచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు, అక్కడున్న వన్యప్రాణులను కాపాడడంతో పాటు యూనివర్సిటీలను గాడి లో పెట్టాలని కోరారు. ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ అమృతాచారి, టీ యూ శాఖ అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. యూనివర్సిటీ జాయింట్ సెక్రటరీ సమీర్, అశోక్, అజయ్, అనిల్, పృథ్వీ, రోహన్, నరేందర్, రమణ, ఉదయ్, సాయి, కౌశి క్, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆలయం ఎదుట జెండా గద్దె నిర్మాణం

- అడ్డుకున్న పోలీసులు
- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య వాగ్వాదం


వినాయక్‌నగర్, ఏప్రిల్ 2: జాతీయ జెండాను ఎగురవేయడానికి కాంగ్రెస్ నాయకులు న్యాల్‌కల్ చౌరస్తా వద్ద ఉన్న హనుమాన్ ఆలయం ఎదుట గద్దెను నిర్మించారు. ఆలయం ఎదుట నిర్మించడంపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఆయా పార్టీల నాయకుల మధ్య బుధవారం వాగ్వాదం చోటుచేసుకున్నది. విషయం తెలుసుకున్న నగర సీఐ శ్రీనివాస్‌రాజ్, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జెండా ఆవిష్కరణను ఎలా అడ్డుకుంటారని, ఏమైనా ఉంటే ముందు నోటీసులు ఇవ్వాలని సీఐని నిలదీశారు. జాతీయ జెండాను ఎగురవేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులతో వాగ్వాదానికి దిగిన నాయకులు

# కొత్త రేషన్ కార్డులు ఎప్పుడో?

- వేచిచూస్తున్న సామాన్య ప్రజలు
- రోజుకో మాట చెబుతున్న సర్కారు
- గడువు మీరుతున్నా.. మంజూరు కరువు
- ఇచ్చిన మాట తప్పుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



నిజామాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కొత్త రేషన్ కార్డుల మంజూరు చేయడంలో జాప్యం కొనసాగుతూనే ఉన్నది. అప్పుడూ.. ఇప్పుడూ అంటూ రాష్ట్ర ప్రభుత్వం కాలం వెల్లదీస్తున్నదే తప్ప సమయానికి కార్డులను జారీ చేయడం లేదు. బీపీఎల్, ఏపీఎల్ పేరిట మరో కొత్త పద్ధతికి తెర లేపడంతో లబ్ధిదారులను భయం వెంటాడుతున్నది. రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం సరఫరా మొదలవ్వడంతో రేషన్ కార్డులకు మరింత ప్రాధాన్యత పెరిగింది. సన్న బియ్యం ధరలు బయటి మార్కెట్లో భారీగా ఉన్నాయి. రేషన్ షాపుల్లో ఈనెల నుంచి సన్న బియ్యం ఇస్తుండడంతో ప్రజలంతా ఆసక్తి చూపుతున్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో రేషన్ కార్డుల జారీ కూడా ఒకటి. అధికారం చేపట్టిన అనంతరం మాట మారుస్తూ.. నిబంధనల బూచీని ముందు పెట్టి ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారు. ఆదాయ ధ్రువీకరణకు పరిమితిని పెంచకుండానే బీపీఎల్, ఏపీఎల్ పేరిట కొత్త విధానాన్ని తీసుకు వస్తుండడంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడుతున్నది. రేషన్ కార్డుల జారీలో పారదర్శకత పాటించాలని, నిబంధనల పేరిట వేధించొద్దని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గ్రామ సభల పేరిట హడావిడి చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రేషన్ కార్డుల జారీలో ఎలాంటి ముందడుగు వేయలేదు. గ్రామసభల రోజు నామమాత్రంగా కొన్ని కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నది.

**ఉమ్మడి జిల్లాలో 6.37లక్షల రేషన్ కార్డులు..**

రేషన్ కార్డుల జారీ ప్రక్రియలో భాగంగా పూటకోసారి ప్రభుత్వం విరుద్ధమైన ప్రకటనలు చేస్తుండడంతో ఆశావాహుల్లో అయోమయం నెలకొన్నది. కుటుంబ సభ్యుల పేర్లను రేషన్ కార్డుల్లో చేర్పించడానికి వచ్చిన మీ సేవ దరఖాస్తులను అధికారులు జిల్లా నుంచి పౌరసరఫరాల శాఖ కమిషనర్ లాగిన్‌కు పంపించారు. అక్కడ ఆమోదం లభిస్తే పేర్లు రేషన్ కార్డుల్లో చేరుతాయి. మొదటి బిడ్డ దరఖాస్తు పెండింగ్‌లో ఉండడంతో రెండో బిడ్డకు సంబంధించిన పేర్లను మీసేవ సైట్ తీసుకోవడం లేదు. రెండో బిడ్డ కలిగిన సుమారు 40వేల మంది రేషన్ కార్డుల్లో పేర్ల నమోదుకు దరఖాస్తుల అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో 4,03,025 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. 12,83,215 మంది సభ్యులు ఉన్నారు. ప్రతి నెలా 7,450 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా విడుదల అవుతున్నది. కామారెడ్డి జిల్లాలో ఆహార భద్రత కార్డులు 2,34,979 ఉన్నాయి. 8,04,432 యూనిట్లు ఉండగా బియ్యం కోటా ప్రతి నెలా 48.26లక్షల కిలోలుగా ఉన్నది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 6లక్షల 37వేల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపుగా 21లక్షల మంది సభ్యులున్నారు. కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తే ఈ సంఖ్య భారీగా పెరుగనున్నది. కానీ ప్రభుత్వం ఏం చేస్తుందో? వేచి చూడాల్సి ఉంది. అర్హత పేరిట చాలా చోట్ల కార్డులను తొలగించడంపైనే దృష్టి పెడుతున్నట్లు తెలుస్తున్నది.

**దరఖాస్తుదారుల్లో భయం.. భయం..**

రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఆందోళన వెంటాడుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారు. కొత్త రేషన్ కార్డులను ఉగాది పర్వదినానికి అందిస్తామన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి చేతికి కొత్త కార్డులు వస్తాయని దరఖాస్తుదారులు ఆశగా ఎదురు చూశారు. కానీ పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. దరఖాస్తుదారుల అప్లికేషన్లు ఇంకా పరిశీలన దశలోనే ఉన్నాయి. ప్రజాపాలనలో దరఖాస్తు చేసిన వారంతా రెండు నెలల క్రితం జరిగిన గ్రామ సభల్లోనూ మొరపెట్టుకున్నారు. కొత్తగా తమ పిల్లల పేర్లను చేర్చాలని విన్నవించారు. రోజులు గడుస్తున్నప్పటికీ పరిస్థితిలో మార్పు కానరావడం లేదు. రేషన్ కార్డుల జారీలో ఎలాంటి ముందడుగు పడడం లేదు. కొత్తగా వివాహం చేసుకుని, వేరే కాపురం ఉంటున్న కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసేందుకు పాత రేషన్ కార్డు నుంచి పేరును తొలగించుకున్నారు. ఇప్పుడు రెంటికి చెడ్డా రేవడిలా వారి పరిస్థితి మారింది. అటూ పాత దాంట్లో పేరు పోగొట్టుకొని, ఇటు కొత్త రేషన్ కార్డులు చేతికి రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులను అడిగితే తమకేమి సంబంధం లేదని చెబుతూ చేతులెత్తేస్తున్నారు. దీంతో ఆశావాహులంతా లబోదిబోమంటున్నారు.

# 'బోనస్' కాజేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- విజిలెన్స్ అధికారులతో విచారణ చేయించాలి
- కోటగిరి సహకార సంఘం ఎదుట ధర్నా





కోటగిరి సహకార సంఘం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కోటగిరి, ఏప్రిల్ 2: రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వడ్లకు ఇచ్చిన 'బోనస్'ను కాజేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కోటగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సం ఘం ఎదుట రైతులతో కలిసి బుధవా రం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు, కోటగిరి మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ మాట్లాడుతూ.. వానకాలం సీజన్‌లో కోటగిరి సహకార సంఘానికి ధాన్యం విక్రయించిన రైతుల జాబితాను బహిర్గతం చేయాలన్నారు. రైస్‌మిల్లర్లతో చేతులు కలిపి కొందరు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన బోనస్‌ను కాజేశారని ఆరోపించారు. సుమారు రూ.50లక్షల అవినీతి జరిగిందని, దీనిపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఐ నాయకులు నల్ల గంగాధర్, బుడాల రాములు, వీరేశం, కాంగ్రెస్ నాయకుడు ఆనంద్, మాజీ ఎంపీటీసీ సలీం, కూచి సాయిబాబా, నజీర్, చోటేమియా, ఆకుల లక్ష్మణ్, సోహెల్, బుడాల శివరాజు, హన్మాండ్లు, పాకల సాయిలు, నర్సయ్య, సాయిలు పాల్గొన్నారు.





పరీక్షలు ముగియడంతో విద్యార్థుల సంబురం

# ముగిసిన టెన్త్ పరీక్షలు



కామారెడ్డి/ ఖలీల్‌వాడి, ఏప్రిల్ 2: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి. దీంతో చివరి రోజు సాంఘిక శాస్త్రం పరీక్ష రాసిన విద్యార్థులు కేరింతలు కొడుతూ కేంద్రం నుంచి బయటికి వచ్చారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. దీంతో బస్టాండ్లు కక్కిరిసి పోయాయి. బస్సుల్లో రద్దీ పెరిగింది. కామారెడ్డి జిల్లాలో నిర్వహించిన పరీక్షకు మొత్తం 12,579మందికి 12,550 మంది హాజరవగా.. 29మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో రాజు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో 22,743మందికి 22,695 మంది హాజరవగా.. 48మంది గైర్హాజరైనట్లు డీఈవో అశోక్ తెలిపారు.